క్లుప్తంగా

ఇంటింటికీ జగనన్న సురక్ష సర్వే



జగనన్న సురక్ష సర్వే చేస్తున్న కౌన్సిలర్ సాయిసంధ్యారాణి

నగరి : జగనన్న సురక్ష సర్వేను ప్రతి వార్డులో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు, మున్సిపల్ సచివాలయ కౌన్సిలర్లు నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి తీరని సమస్యలు, అవసరమైన సర్టిఫికెట్ల వివరాలను సేకరిస్తున్నారు. గురువారం 6వ వార్డులో కౌన్సిలర్ సాయిసంధ్యారాణి స్థానిక వలంటీర్లు, పార్టీ నాయకులతో పాటు జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. సర్వేలో తెలుసుకున్న అంశాలకు సచివాలయంలో టికెట్ జనరేట్ చేసి సచివాలయ పరిధిలో మున్సిపల్, మండల అధికారులతో నిర్వహించే క్యాంపులో సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని నివాసితులకు తెలియజేశారు.

గడ్డివామి దగ్ధం



వెదురుకుప్పం: మండలంలోని ఆళ్లమడుగు దళితవాడలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో చెంగయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. పశువుల మేత కోసం ఇంటి సమీపంలో గడ్డిని నిల్వ చేశారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో గడ్డివామి పూర్తిగా కాలిబూడిదైంది. దీంతో రూ.25 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అందుబాటులో కొత్తరకం రాగి మినీ కిట్లు

విజయపురం : మండలంలో ఇందిరావతి రకం రాగి విత్తనాల మినీ కిట్లు సిద్ధంగా ఉన్నాయని ఏఓ రజినికుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 1.25 క్వింటాళ్ల ఇందిరావతి రకం రాగి మినీ కిట్‌ను తెప్పించామని, ఆసక్తి గల రైతులు తీసుకోవాలన్నారు. ఈ రకం రాగి సాగు పరీక్ష నిమిత్తం (శ్యాంపిల్) కోసం రైతులకు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో దిగుబడి శాతం తెలుసుకోవడం కోసం ఎలాంటి రుసుం తీసుకోకుండా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రదోషకాల పూజలు రేపు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏక కాలంలో నందీశ్వరునికి, శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాలసముద్రం ఎస్‌ఐగా ప్రసాద్



పాలసముద్రం : మండల సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ)గా ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నూతన ఎస్‌ఐ ప్రసాద్‌ను శాలువతో సన్మానించారు.

ఎంఈఓ-2గా సబర్మతి



ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరంగరాజపురం : మండల రెండవ విద్యాధికారిగా సబర్మతి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈమెను ఎంఈఓ-2గా నియమించారు. ఈ సందర్భంగా గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. విద్యార్థులు, పాఠశాలల అభివృద్ధికి మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మండల విద్యాధికారి అరుణాచలం రెడ్డిని, రెండవ విద్యాధికారి సబర్మతిని శాలువలతో సన్మానించారు.

గడ్డి ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు

తిరుపతి అర్బన్: గడ్డి ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతిలోని టీటీడీ గోశాల, అక్కారంపల్లి వద్దనున్న లెప్రసీ హాస్పిటల్ పరిధిలోని 25 ఎకరాల భూమిలో నిర్వహిస్తున్న దేశీఆవుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై జూమ్ మీటింగ్ ద్వారా టీటీడీ జేఈవోతో సమీక్షించారు.

లక్ష్యం దిశగా జగనన్న స్వచ్ఛసంకల్పం



శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



పాలసముద్రం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ లక్ష్మి (ఫైల్)

గ్రామాల్లో జగనన్న స్వచ్ఛసంకల్పం పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. వీధులు, ఇళ్ల పరిసరాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడంలో రోజురోజుకు ప్రజల భాగస్వామ్యం పెరగడంతో స్వచ్ఛ గ్రామాల దిశగా అడుగులు పడుతున్నాయి.

- గ్రామాల్లో తడి, పొడిచెత్త సేకరణతో పరిశుభ్రత
- సత్ఫలితాలు ఇస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం
- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో ఎరువుల తయారీ
- రైతులకు తక్కువ ధరకే ఎరువులు విక్రయం
- వచ్చిన ఆదాయంతో పంచాయతీల అభివృద్ధి

పాలసముద్రం: గ్రామాల పరిశుభ్రత కోసం ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకం లక్ష్యం దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ పథకం పటిష్టంగా అమలు అవుతుండడంతో గ్రామాలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఉదయాన్నే వీధుల్లో విజిల్ వేస్తూ గ్రీన్ అంబాసిడర్లు చెత్త రిక్షాతో ఇంటి ముంగిటకే వచ్చి చెత్తను అందించాలని కోరతున్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గతంలో పోల్చితే ప్రస్తుతం ప్రజల భాగస్వామ్యం పెరగడంతో జగనన్న స్వచ్ఛసంకల్పం పథకం విజయవంతం అవుతోందని, అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో చెత్త సేకరణతో ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు పంచాయతీలకు ఆదాయ వనరుగా మారింది. నాడు చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా ఉన్న పల్లెలు నేడు అందంగా కనిపిస్తున్నాయి. చెత్త నుంచి ఎరువును తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నారు. తద్వారా వచ్చిన ఆదాయంతో పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షణ..

పాలసముద్రం మండలంలో 13 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో 125 గ్రామాలకు గానూ 23,657 కుటుంబాలు ఉన్నాయి. 44 మంది గ్రీన్ అంబాసిడర్లకు 22 రిక్షాలను ప్రభుత్వం అందించింది. ఈ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అధికారులు దృష్టి పెడుతున్నారు. అధికారులు గ్రామాల్లో చెత్తసేకరణను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి గ్రీన్ అంబాసిడర్లు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. సేకరించిన చెత్తను ఐదు రకాలుగా విభజిస్తారు. ప్లాస్టిక్ గాజు సీసాలు, చిత్తు కాగితాలు, పాత ఇనుప, పాత సంచులు, తడి, పొడి చెత్తలను వేరు చేస్తారు. చెత్తను వర్మీకంపోస్టు ఎరువుగా తయారు చేసి రైతులకు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలకు జమ చేస్తున్నారు. పంచాయతీల్లో తలెత్తే సమస్యలకు ఆ నిధిని వాడుకుంటున్నారు.

ఆదర్శంగా ఆ నాలుగు పంచాయతీలు

మండలంలో 12 డంపింగ్ యార్డులు ఉండగా వాటి ద్వారా ఏడాదికి 7 వేల కేజీల ఎరువు తయారవుతోంది. వీటిని విక్రయించగా రూ.లక్ష ఆదాయం సమకూరుతోంది. ప్రధానంగా పాలసముద్రం పంచాయతీ చెత్త సేకరణతో పాటు ఎరువుల విక్రయం, ఆదాయంలో ముందు వరుసలో ఉంది. ఏడాదికి ఈ పంచాయతీకి డంపింగ్ యార్డు నుంచి రూ.45 వేల వరకు ఆదాయం వస్తోంది. శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో 600 కేజీల వరకు చెత్త సేకరణ జరగ్గా ఆదాయం రూ.15 వేలకు పైగా వస్తోంది. వనదుర్గాపురంలో 500 కేజీల వరకు చెత్త సేకరించగా రూ.10 వేలు, నరసింహపురం 450 కేజీలకు రూ.6 వేలు ఆదాయం వస్తునట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మిగిలిన పంచాయతీల్లో కూడా ఆదాయాన్ని పెంచేందుకు అధికారుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. కాగా నాలుగు పంచాయతీలు మాత్రం చెత్త సేకరణలో ఆదర్శంగా నిలుస్తున్నాయి.

అందరి సహకారంతోనే



గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చెత్త, చెదారాలను తొలగిస్తున్నాం. తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందిస్తున్నాం. స్వచ్ఛ గ్రామంగా రూపాంతరం చెందడడంతో పాటు చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేస్తున్నాం. ఆ ఎరువును రైతులకు విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాలో జమ చేస్తాం.

– సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, పాలసముద్రం

చెత్త సేకరణకు ప్రత్యేక శ్రద్ధ



గ్రామాల్లో అనారోగ్యం, అంటు వ్యాధులకు కారణం అపరిశుభ్ర వాతావరణమే అని గుర్తించాం. పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని గ్రామాలను స్వచ్ఛత దిశగా తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేస్తున్నాం. ప్రతి ఇంటికీ రెండు చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్నాం.

– గాలి మహేష్‌బాబు, శ్రీకావేరిరాజుపురం, సర్పంచ్

చెత్త నుంచి ఎరువుల తయారీ



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం అమలులో భాగంగా ప్రజల్లో చాలా మార్పులు గమనించాం. గ్రామాల్లో పరిశుభ్రత నెలకొంది. తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని కూడా సమకూరుస్తున్నాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తయారు చేస్తున్న వర్మీకంపోస్టు ఎరువు గిరాకీ పెరుగుతోంది.

– ప్రేమ్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ, పాలసముద్రం

పేదలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం





సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రికి హారతులు పడుతున్న లబ్ధిదారులు

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- మేము వెళ్తుంటే ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు
- చంద్రబాబుకు మాత్రం ప్రజలంటే నచ్చదు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం ఎంఎం విలాసం పంచాయతీ పరిధిలోని కొత్తఇండ్లు, మాకమాంబాపురం, కుమ్మరగుంట, ఒడ్డిండ్లు, ఎం.కృష్ణాపురం, ఎస్ఆర్ కండ్రిగ గ్రామాల్లో సర్పంచ్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందిస్తోందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. పేదల పాలిట కల్పవృక్షంలా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకి రావణుడి లక్షణాలు

రావణాసుర లక్షణాలు కలిగిన చంద్రబాబు అధికారం కోసం తహతహలాడుతున్నాడని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. అలాంటి రాక్షసుడికి ఓట్లు వేస్తే రాష్ట్రం 30 ఏళ్ల అభివృద్ధిలో వెనక్కి వెళ్లిపోతుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్టణాలు, గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ అధికారులను చేరువ చేశారన్నారు. పుట్టబోయే శిశువు నుంచి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమాలకు లబ్ధిదారులు మంత్రులు, ఎమ్మెల్యేలను చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, మంగళహారతులు పడుతున్నారని తెలిపారు. పేదల ఆశీర్వాదాలే మాకు శ్రీరామ రక్ష అన్నారు. ఈ క్రమంలో మాకమాంబా విలాసపురం గ్రామానికి చెందిన మహిళలు మాట్లాడుతూ ఒకే ఇంటిలో రెండు కాపురాలు ఉంటున్నామని, ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇల్లు కట్టించాలని మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి నూతనంగా వివాహాలు అయిన వారిని గుర్తించి పక్కాగృహాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఎం.కృష్ణాపురం గ్రామంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని కోరారు. మంత్రి ఏడీఈ నాగరాజును వెంటనే విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే వడ్డిండ్లకు చెందిన మహిళలు వర్షం వస్తే గుంట నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోందని, కల్వర్టు ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన మంత్రి వెంటనే ప్రణాళిక సిద్ధం చేసి నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ దేశమ్మ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, చందురాజు, సర్పంచ్‌లు ధనంజయవర్మ, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దొరస్వామి, ఆనందయ్య, ధనుంజయరాజు, శేషాద్రి, రాజ, హరికృష్ణ, వాసు, వెంకటరమణ, ధనంజయలు, పెరుమాళ్, మురగయ్య, గోవిందయ్య ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఏపీ ఆదర్శం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్

పాలసముద్రం : పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అభివృద్ధిలో దేశంలోనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు పార్టీ కార్యకర్తలకు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 29 రాష్ట్రాల్లో ఏ ముఖ్యమంత్రి అందించలేని విధంగా మన ముఖ్యమంత్రి జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వం పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఎన్ని ఎత్తులు వేసినా మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది జగనన్నే అన్నారు. త్వరలోనే చిత్తూరుకు రానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, నరసింహరాజు, అయ్యప్ప, పుత్తూరు కేశవరెడ్డి, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, చంద్రశేఖర్‌రాజు, సుబ్రమణ్యరాజు, కుట్టి, గోపి, వేణు, బాబు, సిద్ధమందడి, రవిరెడ్డి, వరదరాజు, సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు వెల్లడించారు. వీరు గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

నగరి నియోజకవర్గం:

నగరి మున్సిపాలిటీ :	సీకే.దయానిధి
నగరి రూరల్ :	హరి
పుత్తూరు మున్సిపాలిటీ :	కేసీ.ఎదంబరం
పుత్తూరు రూరల్ :	ఎస్.భాస్కర్‌యాదవ్
వడమాలపేట :	ఎం.సురేష్‌కుమార్
విజయపురం :	డి.రాజగోపాల్
నిండ్ర :	బాబురెడ్డి

గంగాధర నెల్లూరు నియోజకవర్గం:

జీడీ నెల్లూరు :	ఎస్.వెంకటేష్‌రెడ్డి
కార్వేటినగరం :	పురంధర్
పాలసముద్రం :	వేణుబోయడు
పెనుమూరు :	హరికృష్ణ
ఎస్ఆర్‌పురం :	ఎస్.బాలసుబ్రమణ్యం
వెదురుకుప్పం :	బి.సుబ్రమణ్యం

నగరి : మీరాసాహెబ్ పాళెంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



భక్తి శ్రద్ధలతో బక్రీద్

నగరి : పట్టణంలో గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పట్టణంలోని ముస్లింలు బక్రీద్‌ను ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక జామియా, మక్కా మసీదులో అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రత్యేక నమాజ్ చేశారు. ముస్లింలు మధ్యాహ్నం తమ నివాసాల సమీపంలో ఉన్నవారికి విందు భోజనం అందించారు. ముస్లింలు అధికంగా నివశించే మండలంలోని మీరాసాహెబ్ పాళెం, వేలావడి తదితర గ్రామాల్లో బక్రీద్ సందడి కనిపించింది.



నిండ్రలో..



కార్వేటినగరం: మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నిండ్రలో..

మండల కేంద్రమైన నిండ్ర, పాదిరి గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గురుబోధనలు విన్నారు. పలువురు ఖుర్బానీ కార్యక్రమం నిర్వహించారు.

కార్వేటినగరంలో

కార్వేటినగరం: మండలంలోని ముస్లింలు గురువారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం కాలనీలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పలువురు మసీదు ఆవరణలో పేదలకు దాన ధర్మాలు చేశారు. మసీదు, దర్గాలతో పాటు, ముస్లిం కాలనీలోని వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : మండలవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం కోసలనగరం, మహారాజపురం గ్రామాల్లో ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న ద్రౌపదీ అమ్మవారు

కార్వేటినగరం: మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ద్రౌపదీ అమ్మవారు ప్రత్యేక వాహనంపై కొలువుదీరి గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఉభయదారులైన కరిణికులు సమర్పించిన పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్ప మాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై అమ్మవారిని ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల నడుమ, బాణసంచాలు పేలుస్తూ అంగరంగ వైభవంగా ఊరేగించారు. అలాగే భాగవతారిణి రెడ్డెమ్మ హరికథ కాలక్షేపాన్ని కనులకు కట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.

పథకాల గురించి క్షుణ్ణంగా వివరించండి



మాట్లాడుతున్న మండల సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు

పుత్తూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం అమలులో భాగంగా ఇంటింటికి వెళ్లే వలంటీర్లు, గృహసారథులు ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు సవివరంగా తెలయజేయాలని వడమాలపేట సచివాల కన్వీనర్ సురేష్‌రాజు చెప్పారు. వడమాల, అప్పలాయగుంట సచివాలయ పరిధిలోని వలంటీర్లకు, గృహసారథులకు జగనన్న సురక్ష శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సురక్ష పథకం ద్వారా ప్రజలకు సత్వర మేలు జరుగుతుందని తెలిపారు. అర్హత ఉండి, వివిధ సేవలు, పథకాల లబ్ధి పొందడంలో విఫలమైన వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడమే ఈ జగనన్న సురక్ష పథక లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీవిద్య, అంజమ్మ, శేషాద్రిరెడ్డి, నాయకులు సుధీర్‌రెడ్డి, రమేష్‌రాజు, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై రాధా సమేత కృష్ణుడు



పురవీధుల్లో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవారు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో వెలసిన రాధా, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి ఆలయంలో మండల పూజలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు వేదపండితులు పూజలు, ప్రత్యేక దీపారాధనలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పుష్పపల్లకిలో సుందరంగా అలంకరించారు. అనంతరం పురవీధుల్లో బాణసంచా పేల్చి, మంగళ వాయిద్యాలు, యువకుల నృత్యాల మధ్య కోలాహలంగా ఊరేగించారు. గ్రామంలో ప్రతి ఇంటా మహిళలు కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లను సింగిల్‌విండో అధ్యక్షురాలు గాలి జ్యోతి, సర్పంచ్ గాలి మహేష్ బాబు దర్శించుకున్నారు.

ఏకాదశి ఉత్సవంలో కల్యాణ వెంకన్న



గ్రామోత్సవంలో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయంలో నిత్యపూజా కార్యక్రమాలను అర్చకులు పుర్తి చేశారు. పాలకడలి మదనానంతరం మహావిష్ణువు శయనించిన రోజు నుంచి తెలుగు పండుగలు ప్రారంభమవుతాయని, ఆ రోజునే తొలి ఏకాదశిగా, శయన ఏకాదశిగా కొలుస్తారని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య పేర్కొన్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్న అధిష్ఠించి మాడవీధుల్లో గ్రామోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆస్థానం నిర్వహించారు. ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

రైతులకు వేరుశనగ, కంది విత్తనాల పంపిణీ



రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

రేణిగుంట: మండలంలో కరకంబాడి పంచాయతీ వనస్థలిలోని రాస్ కేవీకేలో గురువారం రైతులకు వేరుశనగ, కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా, వెదురుకుప్పం మండలం దామరకుప్పానికి చెందిన 100మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అధిక దిగుబడినిచ్చే టీసీజీఎస్-1694 రకం వేరుశనగ విత్తనాలు, ఎల్ఆర్‌జీ-105 రకం కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ విత్తనాలను ప్రదర్శన క్షేత్రాల్లో సాగుచేసి వచ్చే దిగుబడిలో మరికొంత మందికి ఇవ్వాలని కోరారు. ఈ పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, మెళకువలను వివరించారు. అనంతరం ఔషధ మొక్కలు, ఉద్యాన పంటల నర్సరీలు, అజోల్లా, వానపాముల ఎరువుల తయారీ, భూసార పరీక్ష కేంద్రాలను రైతులు సందర్శించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు దివ్య, శ్రీలత, పద్మజ, అనుష, దామరకుప్పం సర్పంచ్ మమత పాల్గొన్నారు.